# కల - నిజం

జనాన్ని తప్పుకుంటూ, తోలగనెట్టుకుంటూ, గౌరిగాడు గేటుదాటి బయటికి వచ్చాడు పిండారబోసినట్టుగా తెల్లని వెలుగును వెదజల్లే ఎలక్ట్రిక్ లైట్లు వెనకా సోలుపుగా రోడ్డు మీద అంతా గౌరిగాడికి అదో తెలియని తీయని కొత్త ప్రపంచంలోకి జొరబడుతున్నట్టుగా తోచింది

సినిమాలో కథానాయకుడు, కథానాయకి పాడిన ఆ పాట ల్లోని ఏ ఒక్క చరణమూ సొంతంగా గొంతుకు పట్టకపోయినా, మొత్తం కథలోని ప్రేమ—శృంగార రసాలూ, ఆ ఘట్టాలూ నిండుగా అతడి వంటికి తైలమర్దనంలా పట్టుకుని యింకిపోయినై

సినీమా కథానాయకుడిలానే గౌరిగాడికీ ఏదో తెలియని బాధా మదిలో కళ్ళు తెరుస్తూన్న కలవరం గురివింద తీగల్లా అన్ని వైపులనుంచీ గుబురుకున్నయ్

రోడ్డుకు ఓ ప్రక్కగా కాళ్ళీడ్చుకుంటూ నడిచే గౌరిగాడు, మనస్సును ఊహా ప్రపంచంలోకి పరిగెత్తించాడు

కథానాయకి సుగంధిని నిజంగా రాజు కూతురులానే అందమైంది తను కట్టుకోబోతున్న పుల్లాం ఆ మాటకొస్తే ఫాదిరీ కూతురు ఎంజలమ్మకూడా, ఆ అందం ముందు పొగ చూరిన కట్టెపేడుల్లా కనబడతారు అయినా అంత అందంగల రాజకూతురు తండ్రిదగ్గిర బంట్రోతుగిరి చేసేవాడి కొడుకును ప్రేమించడం

అతడు నిలబడ్డాడు రోడ్డు ప్రక్కన చింతచెట్టు కింద వదిలి వచ్చిన బండి వంక చూశాడు గుండెలు గతుక్కుమన్నయ్ మోకాళ్ళల్లో పట్టు సడలినట్టయింది చింతచెట్టు గుబురు కొమ్మల కింది పల్చని చీకటిలో తన యజమాని ఎడ్లను అదిలిస్తున్నాడు

గారిగాడు గబగబ నడిచాడు సినీమాలోని రాజు కూతురు అతని మనోకాశంలోని మబ్బుల చాటుగు మాయమైంది

"ఏరా! వొళ్ళు బలిసిందా! ఇప్పుడుదాకా ఏంచేస్తున్నావ్?"

గారిగాడు గజగజ లాడాడు యజమాని సీతయ్య చేతిలో చర్నాకోలుకోసం కళ్ళు కుంచించి చూశాడు

"వెధవాయికి సినిమా చూసి మతిచెడింది కామోలు!"

శాంత నవ్వుతూనే అంది— మళ్ళీ ఫక్కున నవ్వింది తల్లి సూరమ్మ కూడా వంత నవ్వింది ఒక్క సీతెయ్య మాత్రం నవ్వకుండా గట్టిగా గదమాయించాడు

"బండి కట్టు! ఊఁ! తొందరగా"

గారిగాడు తలవంచుకునే ఎడ్లను కాడి కిందకు లాగాడు అవి రాక మొరాయించినై

"ఓరి గాడిదా! ఎలపటా దాపటా కూడా మరచిపోయావా!" సీతయ్య పళ్ళుకొరికాడు శాంత మళ్ళీ ఫక్కున నవ్వింది తల్లి సూరమ్మ మాత్రం చూస్తూ వూరుకున్నది

గౌరిగాడు తొట్లో కూర్చుని బండి తోలుతున్నాడు శాంతా, సూరమ్మా సీతయ్యా వెనక జల్లలో నవారికింద కూర్చుని మాట్లాడు కొంటున్నారు శాంత మధ్య మధ్య నవ్వు తూనే వుంది

ఎడ్లు అదిలించకుండానే వేగంగా నడుస్తున్నయ్ గౌరిగాడికి శాంత మధ్య మధ్య నవ్వినప్పుడల్లా, శరీరం కుదిలించి నట్టవు తోంది ఆ నవ్వు అచ్చుగా సినీమాలో రాజకూతురు నవ్వు లాగేవుంది

చవితినాటి చంద్రుడుఆకాశంలో మేఘాలమీదగా-కిందగాపర వళ్ళు తీస్తున్నాడు ఎలక్ట్రిక్ దీపాలూ రణగొణధ్వనులూ లేని పల్లెటూరి రోడ్డుమీదుగా బండి కుదుల్తూ కదులుతోంది రోడ్డుకు యిరువైపులావున్న తుమ్మచెట్లమీంచి విరగపూసిన తుమ్మ పువ్వుల మదపువాసన గౌరిగాడి నాసికా రంధ్రాలను తాకి శరీరాన్ని వుడుకెత్తిస్తోంది నూగు మీసాలమీద అరిచేతిని రుద్దుకుని ఎడ్లను గట్టిగా అదిలించి తిరిగి ఊహా లోకాల్లోకి ఎగబాకాడు

ఆ మరునాటిరాత్రి సగం నూర్చిన కుప్పపక్కన, తడీపొడీగా వున్న నూర్పిడి గడ్డిలో వెల్లకిలా పడుకుని, గౌరిగాడు ఆకాశం లోకి చూస్తూ తిరిగి సినీమా చూడసాగాడు

ఒక్కొక్క దృశ్యమే అతడికళ్ళముందు పంచమినాటి చంద్రుడి కాంతిలో కదిలింది

'ప్రేమకు బీదా—పేదా, తేడా లేదు"

"మా నాయన దగ్గిర నౌకరీ చేసేవాని కొడుకునైతే మాత్ర మేం! నీ సాహసం ధైర్యం" రాజు కూతురు పక్కకు తలతిప్పి గుబురుగావున్న తెల్లని పువ్వుల చాటున పకపకాన నవ్వింది

గౌరిగాడు అదిరిపడి లేచాడు అతడి నరనరలూ సాగనార తాడులా కరు కెక్కినై నూనూగు మీసాలు నాగుజెముడు ముళ్ళలా నిటారుగా నిలబడి పదు నెక్కినై

"ఆ నవ్వు! ఆ నవ్వు!"

గౌరిగాడు అరిచాడు వెలుగును చూచిన ఖైదీలా, పరమ సత్యాన్ని కనుగొన్న తపస్విలా, ఆనందంతో గొంతెత్తి పాడాడు ఆ పాటకు ఎండిన వరిదుబ్బుల్లో నుంచి నాముపిలకలు పుట్టి బయటికి తొంగి మాసినై చేలగట్లూ, నెర్రుల్లో దాక్కున్న బుర్రి పిట్టలూ, కలుగుల్లోని తాచుపాములూ, పెరిగి రెక్కలు విదిలించుకుని మెలికలు తిరిగినై

గౌరిగాడు, ఆకాశంలోని చంద్రుడివంక చూస్తూ ఊరి వైపుకు గొంతెత్తి పాడాడు ఆపాట సీతయ్య నడవాయింటి సీనారేకు గొట్టాలగుండా శాంత గదిలోకి ప్రవేశించి ఆమెను వుక్కిరి బిక్కిరి చేసి ఫక్కున నవ్విస్తుందని అతడి ఆశ

తెల్లవారింది సూర్పిడి జోరుగా సాగుతోంది గౌరిగాడు బంతి తిప్పుతున్నాడు ఎడ్లు, ఆవులతోపాటు, అతడూ శరీరాన్ని గానుగ ఎద్దులా గిరున కుప్పగడ్డిలో తిప్పుతున్నాడు మనస్సు మాత్రం తన యజమాని కూతురు శాంత వోణీలోని అన్ని మడతల్లో, పొరల్లో గిరున తిరుగుతూ కితకితలు పెడుతోంది,

"ఈ గాడిదకు మతిపోయింది!"

శీతయ్య పెద్దగా అరుస్తున్నాడు. గౌరిగాడు వులిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. బంతి గొడ్లన్నీ ఓ చుట్టు తిరిగి అతడి వీపు వెనకకు వచ్చి ఆగివున్నయ్.

తిరిగి శరీరాన్ని పనికి వప్పచెప్పి, మనస్సును వూహా వాయువుల మీదుగా వూళ్ళోకి నడపు సుడిగాలిలా శాంతను చుట్టుముట్టాడు.

సూర్యుడు తలమధ్య కెక్కాడు. పని వాళ్ళంతా ఎవరి అన్నం మూటలు వాళ్ళు విప్పుకుని భోజనాలకు తలపడ్డారు. సీతయ్య రుసరుసలాడుతూ అన్నాడు—

"గౌరిగా! తొందరగా కూడుతిని రావాలి. ఈ పనైన తరువాత నీ మత్తుగు మందేస్తాను!"

గౌరిగాడు తలవంచుకుని వూళ్ళోకి బయలుదేరాడు. అతణ్ణి ఒకెఒక సంశయం నరాల్లో కెక్కిన యీతముల్లులా బాధిస్తోంది. "పెళ్ళి విషయం సితెయ్యను అడగడమా? శాంతనుఅడగడమా?"

ఆ కాల్చే ఎండలో చేల గట్లంట నడుస్తూ, మగత నిద్దరలో వున్నవాడిలా, మధ్య మధ్య భూతావేశం కలిగిన వాడిలా, అటూ యిటూ గట్లమీద జారుతూ, సినిమా కథానాయకుడి మాటల్నీ, చేష్టల్నీ మననం చేయసాగాడు.

"సాహసే లక్ష్మి" అవును! దేనికైనా సాహసించాలి! సినిమా కథానాయకుడు చేత్తో తాచుపామును పట్టాడు! తను క్రిరుచెప్పుల కాలితో దాని పడగను తొక్కిపట్టి చంపాడు. రాజుకూతురికీ, ఆ కథానాయకుడికీవున్న స్నేహానికన్నా, తన

స్నేహం శాంతతో మరీ చిన్నప్పటినుంచి ప్రారంభమైంది తను వూహా తెలిసినప్పటినుంచీ సీతయ్య ఇంట్లో జీతం చేస్తున్నాడు

ముళ్ళనే భయం ఏమీ లేకుండా తను ఆ చిన్నతనంలో ఎన్నిసార్లు శాంతకు రేగికాయలు కోసి పెట్టలేదు! ముంజకాయలు కావాలంటే—కాళ్ళకు బందమైనా లేకుండా ఎన్నిమార్లు తను అంతంత తాడిచెట్లు ఎక్కలేదు !!

తనపెళ్ళి పుల్లాంతో జరగటం అసంభవం చింపిరిపేలికలతో, మడ్డిమొహంతో జీబిరిజుట్టుతో పేడతట్ట నెత్తినపెట్టుకొని వస్తుంటే—ఆ రోజుల్లో ఎలావున్నా ఇప్పుడు తలుచుకుంటేనే నేపాళంమాత్ర వేసుకున్నట్టుగా అవుతోంది

'సీతయ్య ఆ రాజులాగానే డబ్బుసంపాయించమంటాడా?' గౌరిగాడిముందు హఠాత్తుగా ఈ ప్రశ్న తాచుపాములా ఎగిరి నిలబడింది

విష్ణాలయంపక్క పాడుపడిన బావిలో లంకిణీ బిందెలు వున్నమాట నిజమేగదా! దానయ్యా చలమయ్యా వాటికోసం ప్రయత్నించి నెత్తురు కక్కి చచ్చారు కాని తను సాహసించి శాంతకోసం తెగించి వాటిని బయటకు తేలేడా?

గౌరిగాడి గుండెల్లో భయం ఎద్దుకొమ్ములా మొన తేలింది

తను విన్నదయ్యాల కథలు, ఫాదిరీచెప్పే సైతాన్ చరిత్ర—అంతా అతడికాళ్ళనూ, హృదయాన్నీ జెర్రిపోతులా మెలివేసుకుని ఛెళ్ళు ఛెళ్ళుమని తోకతో చరుస్తోంది

సినీమాకథ మళ్ళీ అతడి కళ్ళముందు, పక్కల్నా, కదుల్లాడింది సాహసం చేయాలి ప్రేమకోసం

తలవంచుకునే వూళ్ళోకి ప్రవేశించాడు నడుం వంచుకొని చావిట్లోకి జొరబడ్డాడు. నల్లగా మాడుకట్టిన మల్లని ఏవగింపుగా చేతిలోకి తీసుకుని పెద్దగా అరిచాడు—

"శాంతమ్మా! శాంతమ్మా!"

"ఏంరా! మతిబోయిందా? అరుస్తావెందుకు?" నూరమ్మ కూశలేస్తూ బయటకు వచ్చింది

"తొందరగా వెళ్ళాలి! బువ్వ "

"ఛోవే! వాడికి అన్నంపెట్టి త్వరగ పంపు"

గౌరిగాడు గాటికి ఆనుకు కూర్చున్నాడు "సాహసం! సాహసం!" ఆ మాటలు జోరీగల్లా అతడి చెవిచుట్టూ తిరగ నాగినై నిర్ణయించుకున్నాడు

శాంత అన్నంపెట్టి "సినిమా చూసినప్పటినుంచీ మతి చెడిందా?" అని ఫక్కున నవ్వింది

గౌరిగాడి మదిలో ఏదో తెలియని బాధా కళ్ళు తెరుస్తూన్న కలవరం, గురివింద తీగల్లా అన్ని వైపులనుంచీ గుబురుకున్నయ్

శాంతకు జవాబు చెప్పేందుకు, అలాంటి ఘట్టంలో సినీమా కథానాయకుడు ఏమన్నాడో, ఆ మాటలు గుర్తు చేసుకునేందుకు ప్రయత్నించాడు కానీ ఏగుర్తూ అతడి మనస్సు, గొంతుకు అందించలేక పోయింది

సాధారణంగా— అతి సాధారణంగా, ఎడమకన్ను కొట్టి కుడికాలుతో మల్లను పక్కకుతోసి, రెండు చేతుల్నీ ముందుకు చాపి లేచినుంచుని శాంత వైపుకు నడిచేందుకు ఉపక్రమించాడు

"తొందరగా రావే! పాలు పొంగిన వాసన వస్తోంది"

శాంత యింట్లోక పరిగెత్తింది పరిగెత్తే ముందు ఆ అమ్మాయిలో ఏవుద్రేకాలూ, వుద్వేగాలూ కలిగినయ్యో కాని— బిగువుగానే వున్న ఛోళీ పిగలలేదు పమిట జారలేదు

*　　　　*　　　　*

ఆ రాత్రి సగం తయారైన కడింమీద వెల్లకిలా పడుకుని అష్టమినాటి చంద్రుణ్ణి చూస్తూ గౌరిగాడు పాడేందుకు గొంతు సవిరించబోయాడు

"అరే గౌరిగా!" పెద్ద కేక

"ఏమిటి దొరా!" బెదురుగ చెదిరిన మనస్సులోనుంచి జవాబు

"నువ్వు మధ్యాహ్నం చేసిన పని "

రక్కున సినిమా మాటలు గౌరిగాడి గొంతు చించుకుని బయట పడినై

"నిజమే చెప్పు "

అతడిమాట పూర్తికాకుండానే, నల్లగా చావ తేలిన నున్నటి సంద్రకర్ర కత్తవ అతడి మెడమీద పడింది గింజరాలి కలగా పులగంగా నలిగిన ఆ ఎండు వరిగడ్డిలో కొద్దిపాటి గలగల గిలగిల!

భగ్గున అంటుకుని ఆకాశంవైపుకు నాలుకలు చాచిన ఆ ఎర్రని మంటలకు, ఎండు వరిదుబ్బుల్లో పచ్చగా పెరిగిన నాము పిలకలు మాడిపోయినై, చేలగట్లూ, నెర్రెల్లో దాక్కున్న బుర్రిపిట్టలూ కలుగుల్లోని తాచుపాములూ భయంతో కంపించి, కుంచుకు పోయినై